



బడ్జెట్‌పై భారీ ఆశలు

- నేడు శాసనసభలో ఓట్-ఆన్-అకౌంట్ బడ్జెట్
- బడ్జెట్‌పైనే ఉమ్మడి జిల్లా వాసుల ఆశలు
- కాళేశ్వరం ప్యాకేజీలతో పాటు పెండింగ్ పనులకు నిధుల కేటాయింపుపై చూపులు
- నిజాంషుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణపై కార్మికులు, రైతుల ఆశలు
- సమ్యలపై ఎమ్మెల్యేలు గళం వినిపించేనా?

నిజామాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లా వాసులు బడ్జెట్‌పైనే ఆశలు పెట్టుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఓట్-ఆన్-అకౌంట్ బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు వరాలు కురిపిస్తుందని భావిస్తున్నారు. పెండింగ్ ప్రాజెక్టులతో పాటు విద్యాసంస్థలకు అత్యధికంగా నిధులు కేటాయిస్తారని ఆశతో ఉన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు అనుగుణంగా ఉమ్మడి జిల్లాకు నిధులు వస్తాయని భావిస్తున్నారు. కొత్త ఇంజనీరింగ్, వ్యవసాయ డిగ్రీ కోర్సుల కళాశాలల ఏర్పాటుకు కూడా అనుమతి వస్తుందని అంచనా వేస్తున్నారు.

ఉమ్మడి జిల్లా పరిధిలో పెండింగ్ పనులు

ఉమ్మడి జిల్లా పరిధిలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న పనులతో పాటు గల్ఫ్ వాసుల కోసం ప్రత్యేక పథకాన్ని ప్రకటిస్తారని భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉభయ సభల్లో ఓట్-ఆన్-అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశ పెట్టనున్నారు. శాసనసభ ఎన్నికల్లో భాగంగా ఆరు గ్యారెంటీల హామీలతో పాటు ఇతర పథకాలకు అత్యధికంగా నిధులు కేటాయింపునకు అవకాశం ఉంది. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క శాసనసభలో బడ్జెట్‌ను ప్రవేశ పెట్టనున్నారు.

మంచిప్ప రిజర్వాయర్‌కు భూ సేకరణ లేదు

పదిహేనేళ్ల క్రితం చేపట్టిన ప్రాణహిత చేవెళ్ల ప్యాకేజీ పనులకు కీలకమైన మంచిప్ప రిజర్వాయర్‌కు ఇప్పటి వరకు భూసేకరణ చేపట్టలేదు. రీడిజైన్ వల్ల ఎత్తు పెంచేందుకు గత ప్రభుత్వం అనుమతులు ఇవ్వడం వల్ల ముంపు గ్రామాల ప్రజలు ఆందోళనలు నిర్వహించారు. ఈ ప్యాకేజీల్లో 20, 21 పనులు 60 శాతం వరకు పూర్తికాగా, 22వ ప్యాకేజీ పనులు మాత్రం ఇంకా మొదలు పెట్టలేదు. వీటికి అవసరమైన పంప్ హౌజ్ నిర్మాణం పనులు రెండుచోట్ల సారంగపూర్, మెంట్రాజ్‌పల్లిలో పూర్తిచేశారు. మంచిప్ప వద్ద కొనసాగిస్తున్నారు. పంప్‌హౌజ్‌ల నిర్మాణాలు పూర్తయినా ఇప్పటికీ ఆయకట్టుకు మాత్రం నీటి విడుదల చేయ లేదు. ఈ ప్యాకేజీలకు అవసరమైన నిధులను ఈ బడ్జెట్‌లో కేటాయిస్తారని ఉమ్మడి జిల్లా వాసులు ఎదురుచూస్తున్నారు.

నిజాంషుగర్స్ పునరుద్ధరణపై కార్మికుల ఆశలు

ఈ బడ్జెట్‌లోనే నిజాం చక్కెర కర్మాగారం పునరుద్ధరణకు కూడా నిధులు వస్తాయని రైతులు, కార్మికులు భావిస్తున్నారు. క్యాబినెట్ సబ్‌కమిటీ చక్కెర కర్మాగారాల కోసం నియమించడం వల్ల కొన్ని నిధులు కేటాయిస్తారని అంచనా వేస్తున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని తెలంగాణ విశ్వవిద్యాలయానికి గత కొన్నేళ్లుగా నిధులు ఎక్కువగా రావడం లేదు. వచ్చిన నిధులు కూడా పాలనపరమైన వ్యవహారాలకు మాత్రమే సరిపోతున్నాయి. విద్యార్థులకోసం కావాల్సిన మౌలిక వసతులను కల్పించేందుకు ఎక్కువగా నిధులు విడుదల కావడం లేదు. ఉన్నత విద్యకు ప్రాధాన్య మిస్తామని చెప్పడం వల్ల ఈ బడ్జెట్‌లో ఎక్కువ నిధులు కేటాయిస్తారని విద్యార్థులు అంచనా వేస్తున్నారు. విశ్వవిద్యాలయానికి ఎక్కువగా కేటాయిస్తే నూతన భవనాలు రావడంతో పాటు మౌలిక వసతులు వస్తాయని భావిస్తున్నారు. గత ప్రభుత్వం పదేళ్ల హయాంలో జిల్లాకు కొత్త ఇంజనీరింగ్, వ్యవసాయ కళాశాలలు మంజూరు కాలేదు. ఇతర జిల్లాలో మంజూరైనా ఉమ్మడి జిల్లా పరిధిలో ఏర్పాటు కాలేదు. రుద్రూర్ పరిశోధన కేంద్రంలో బీటెక్ ఫుడ్ టెక్నాలజీని ప్రారం భించినా వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేసేందుకు అన్ని వసతులు ఉన్నా అనుమతులు ఇవ్వలేదు. విశ్వ విద్యాలయం పరిధిలో కంప్యూటర్ సైన్స్ కోర్సులు, ఫిజిక్స్ కోర్సులు ఉన్నా ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయ లేదు. విశ్వవిద్యాలయం నుంచి ప్రతిపాదనలు వెళ్లినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ బడ్జెట్‌లో కొత్త కళాశాలల ఏర్పాటుకు నిధులు కేటాయిస్తారని ఉమ్మడి జిల్లావాసు లు అంచనా వేస్తున్నారు.

ప్రాజెక్టులకు నిధులు కరువు

ఉమ్మడి జిల్లాలో కీలకమైన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, నిజాంసాగర్ ప్రాజెక్టులకు ఎక్కువ నిధులను ఇవ్వలేదు. కాల్వల ఆధునికీకరణకు, మరమ్మతులకు, గేట్ల మరమ్మతులకు పెద్దగా నిధులను గతంలో ఇవ్వలేదు. నామ మాత్రం నిధులతోనే అధికారులు కార్యక్రమాలను కొనసాగించారు. ఈ రెండు ప్రాజెక్టుల్లో సిల్ట్ ప్రధాన సమస్యగా ఉన్నా పట్టించుకోలేదు. కొత్తగా ఏర్పడిన ఈ ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో ఈ రెండు ప్రాజెక్టులకు కూడా నిధులు కేటాయిస్తారని భావిస్తున్నారు. ఇవే కాకుండా మంజీరా, శ్రీరాంసాగర్ పరిధిలో పలు ఎత్తిపోతల పథకాలను చేపట్టారు. కొన్ని నిర్మాణంలో ఉండగా మరికొన్ని మొదలు పెట్టలేదు. నిధులు రాక మధ్యలోనే నిలిచిపోయాయి. వీటికి కూడా నిధులు వస్తాయని భావిస్తున్నారు. వైద్య, ఆరోగ్యసేవల కోసం జిల్లా కేంద్రాల్లో పెద్ద ఆసుపత్రులను ఏర్పాటు చేసినా, మండల కేంద్రాల్లో సరిపడా మౌలిక వసతులు లేవు. వైద్య ఆరోగ్య రంగానికి పెద్దపీట వేస్తామని సీఎం ప్రకటించడం వల్ల ఈ బడ్జెట్‌లో పీహెచ్‌సీలకు కూడా నిధులు వస్తాయని అంచనా వేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో నిధుల కోసం ఎదురుచూస్తున్న వారికి బడ్జెట్ ద్వారా తీపి కబురు వస్తుందని భావిస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారని అంచనా వేస్తున్నారు. కాగా, ఉమ్మడి జిల్లాలో పేరుకుపోయిన సమస్యలు, పెండింగ్‌లో ఉన్న పనులపై ఎమ్మెల్యేలు అసెంబ్లీలో గళం వినిపించాలని జిల్లా వాసులు కోరుతున్నారు.



డీఆర్‌డీఏ ఏపీడీ బలవన్మరణం

- ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య
- కొన్ని రోజులుగా తీవ్ర డిప్రెషన్‌లో ఉన్న సంజీవ్‌కుమార్



(ఫైల్)

నిజామాబాద్ రూరల్, ఫిబ్రవరి 9: జిల్లా డీఆర్‌డీఏ శాఖలో అడి షనల్ ప్రాజెక్టు డైరెక్టర్ (ఏపీడీ)గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న డాక్టర్ జె.సంజీవ్‌కుమార్ (57)శుక్రవారం బలవన్మరణానికి పాల్ప డ్డాడు. నగరంలోని మారుతినగర్‌లో నివాసం ఉంటున్న సంజీవ్‌కుమార్ రోజూ మాదిరిగానే శుక్రవారం ఉదయం తన కారులో కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ కార్యాలయానికి వెళ్లాడు. మధ్యాహ్నం లంచ్ కోసం ఇంటికి వచ్చాడు. తన కారు డ్రైవర్ రాజును హాల్‌లో కూర్చోమని, కొద్దిసేపు రెస్టు తీసుకుంటానని బెడ్రూమ్‌లోకి వెళ్లి గదిలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకున్నాడు. ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్న సంజీవ్‌కుమార్ భార్య జాదవ్ సింధు అదే సమయంలో కారు డ్రైవర్ రాజుకు ఫోన్ చేసి సంజీవ్ కుమార్ భోజనం చేశారా !? అని వాకబు చేశారు. ఒకసారి మాట్లాడ తా ఫోన్ సార్‌కు ఇవ్వాలని చెప్పడంతో.. డ్రైవర్ రాజు సంజీవ్‌కుమార్‌ను పిలవడానికి బెడ్‌రూంకు వెళ్లాడు. లోపల నుంచి లాక్ వేసుకుని ఉండడం.. ఎంత పిలిచినా పలకకపోవడంతో డ్రైవర్ రాజు వెంటనే సంజీవ్‌కుమార్ భార్య సింధుకు సమాచారం ఇచ్చాడు. ఆమె వచ్చి కిటికీలోంచి చూడగా సంజీవ్‌కుమార్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఉండటం చూసి ఆందోళన చెందారు. చుట్టుపక్కలవారు వచ్చి తలుపులు పగులగొట్టి చూడగా అప్పటికే సంజీవ్‌కుమార్ మృతిచెందినట్లు తెలిసింది. సంజీవ్‌కుమార్‌కు కుమారుడు జాదవ్ శశాంక్ సాఫ్ట్‌వేర్ ఉద్యో గం చేస్తున్నారు. కాగా, తన భర్త కొద్దిరోజులుగా డిప్రెషన్‌తో బాధపడుతున్నారని, అంతకుమించి మరే కారణం తనకు తెలియదని భార్య జాదవ్ సింధు తెలిపారు. జాదవ్ సింధు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు నిజామాబాద్ రూరల్ ఎస్‌హెచ్‌వో మహేష్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఫోకస్



జలగాటం

జిల్లాలో మినరల్ వాటర్ పేరుతో కొందరు వ్యాపారులు జనం ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. నిబంధనలకు నీళ్లొదిలి ప్రజల ప్రాణాలను హరిస్తున్నారు. వాటర్ ప్లాంట్ కేంద్రాల్లో నీటి శుభ్రతను గాలికొదిలేస్తున్నారు. శుద్ధి చేయని క్యాన్లలో బోరు వాటర్‌ను నింపుతున్నారు. మోతాదు లేకుండా రసాయనాలను వినియోగిస్తున్నారు. అయితే ఈ వ్యవహారమంతా అధికారులకు తెలిసినా.. పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- జిల్లాలో జోరుగా తాగు నీటి దందా
- నిబంధనలు నీటి పాలు.. ప్రజలు ఆస్పత్రుల పాలు
- పుట్టగొడుగుల్లా వాటర్ ప్లాంట్ కేంద్రాలు
- అనుమతులు లేకుండానే నిర్వహణ
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

బోధన్ రూరల్, ఫిబ్రవరి 9: జిల్లాలో అనుమతులు లేకుండానే మినరల్ వాటర్ ప్లాంట్లను యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. నిబంధనలు పట్టించుకోకుండా కొందరు నీళ్ల దందాను కొనసాగిస్తున్నారు. పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువగా ఉన్న నీటిశుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసుకుని అందినకాడికి దండుకుంటున్నారు. రక్షిత నీరు తాగి ఆరోగ్యాన్ని కాపాడుకుందామనుకునే ప్రజలను శుద్ధిజల కేంద్రాల నిర్వాహకులు పరోక్షంగా ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతిస్తున్నారు. అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా శుద్ధజల కేంద్రాలను నిర్వహిస్తున్నారు. మోతాదు ప్రకారం నీటిలో కలపాల్సిన రసాయన పదార్థాలను ఇష్టం వచ్చినట్లు వేసేస్తున్నారు. శుద్ధజల కేంద్రాలను ఏర్పాటు చేసుకునే వారు ఐఎస్‌ఐ నిబంధనల ప్రకారం నిర్వహించాల్సి ఉంటుంది. నిపుణుల పర్యవేక్షణ సైతం ఎంతో అవసరం. కానీ ఇది ఎక్కడా అమలు కావడం లేదు. యథేచ్ఛగా హోటళ్లు, ఇళ్లు, దుకాణాలు, ఇతర శుభ కార్యాలయాలకు శుద్ధిలేని జలాలను విక్రయిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అనుమతులు లేకుండా మినరల్ వాటర్ ప్లాంట్ కేంద్రాలను కొనసాగిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

వీధికో శుద్ధజల కేంద్రం

బోధన్ డివిజన్ వ్యాప్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో శుద్ధజల కేంద్రాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. గ్రామాల్లో ఒకటి, రెండు శుద్ధజల కేంద్రాలు ఉండగా, నగరాలు, పట్టణ కేంద్రాల్లో అయితే వీధికో శుద్ధజల కేంద్రాలు దర్శనమిస్తున్నాయి. ఐఎస్‌ఐ నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్న కేంద్రాల్లో 20లీటర్ల నీటిబాటిల్ 12రూపాయలకు విక్రయిస్తుండగా అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న శుద్ధజల కేంద్రాల్లో 10రూపాయలలోపుకే 20లీటర్ల నీటిబాటిల్‌ను అందజేస్తున్నారు. కొన్నిచోట్ల అయితే కేవలం 5రూపాయలకే 20లీటర్ల నీటిబాటిల్‌ను అందిస్తుండటంతో శుద్ధనీటి కోసం ప్రజలు ఎగబడుతున్నారు.

శుద్ధజల కేంద్రాల్లో అపరిశుభ్రత..

శుద్ధజల కేంద్రాలు ఎక్కడా నిబంధనల ప్రకారం నిర్వహించడం లేదు. నీటిని సరఫరా చేస్తే వాటర్ బాటిళ్లతో పాటు స్టోరేజీ ట్యాంకులు సైతం నాచుపట్టి అధ్వానంగా మారుతున్నాయి. వారానికోసారి స్టోరేజీ ట్యాంకులను శుభ్రం చేయాల్సి ఉన్నప్పటికీ ఇది ఆచరణలో ఎక్కడా కనిపించడం లేదు. శుద్ధజల కేంద్రంలోని వెళ్లాలంటే ముందుగా కాళ్లను, చేతులను శుభ్రంగా కడుక్కొని వెళ్లాల్సి, తలకు ప్రత్యేకమైన టోపీని ధరించాల్సి ఉంటుంది. ఇవెక్కడా మచ్చుకైనా కనిపించడం లేదు.

అనుమతులు లేకుంటే చర్యలు తీసుకుంటాం..

బోధన్ డివిజన్‌లో ఎన్ని శుద్ధజల కేంద్రాలు ఉన్నాయో తెలుసుకుని వాటి వివరాలను సేకరిస్తాం. అనుమతి లేని శుద్ధజల కేంద్రాలపై చర్యలు తీసుకుంటాం. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న శుద్ధజల కేంద్రాల నిర్వాహకులపై తప్పకుండా కఠిన చర్యలు తీసుకుంటాం.

: ఖమర్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్, బోధన్

అనుమతి లేకుండా 50కిపైగా కేంద్రాలు

బోధన్ పట్టణంలో అనుమతి ఉన్నవి కేవలం నాలుగు శుద్ధజల కేంద్రాలు అయితే అనుమతి లేనివి 40 కేంద్రాల కుపైగానే ఉన్నాయి. బోధన్ పట్టణంలో వీధికో శుద్ధజల కేంద్రాలు దర్శనమిస్తున్నాయి. ఎక్కడ ఎన్ని కేంద్రాలు ఉన్నాయో కూడా మున్సిపల్ అధికారులకు తెలియని పరిస్థితులు ఉన్నాయి. అనుమతి ఉన్నవి ఎన్ని? అనుమతి లేకుండా నెలకొల్పినవి ఎన్ని అన్న కనీస సమాచారం మున్సిపల్ అధికారుల వద్ద లేకపోవడం గమనార్హం. అధికారుల నిర్లక్ష్యంతోనే శుద్ధజల కేంద్రాలు విచ్చలవిడిగా ఏర్పడుతున్నాయి. అధికారుల నిఘా, తనిఖీలు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా శుద్ధజల కేంద్రాలు పుట్టుకొస్తున్నాయి. అనుమతి ఉన్న శుద్ధజల కేంద్రాలు సైతం నిబంధనల ప్రకారం నడుస్తున్నాయా లేదా అన్న విషయం సైతం అధికారులకు తెలియకపోవడం విశేషం. అధికారులు వ్యవహరిస్తున్న నిర్లక్ష్యం ప్రజారోగ్యంపై పడుతుంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి అనుమతి లేని శుద్ధజల కేంద్రాలపై చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైన ఉంది.



బోధన్‌లో అనుమతిలేని శుద్ధజల కేంద్రంలో నీటి స్టోరేజీ ట్యాంకు



శుద్ధజల కేంద్రంలో యంత్రాలు



- ఎర్రజొన్న సీడ్ కంపెనీల యజమానులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

డిమాండ్‌కు అనుగుణంగా ఎర్రజొన్నకు మద్దతు ధర


సీడ్ కంపెనీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

క్వింటాలుకు రూ.3500 తగ్గకుండా ధర చెల్లిస్తామని ట్రేడర్ల హామీ

నిజామాబాద్‌అర్బన్, ఫిబ్రవరి 9: ఎర్రజొన్న కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మార్కెట్ రేటుకనుగుణంగా ధరను చెల్లిస్తూ పంటను సేకరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సీడ్ కంపెనీల ప్రతినిధులకు సూచించారు. ఎర్రజొన్న దిగుబడులు చేతికి అందుతున్న నేపథ్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ యాదిరెడ్డితో కలిసి కలెక్టర్ వ్యవసాయ అధికారులు, విత్తన వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. రైతులతో కుదుర్చుకున్న బైబ్యాక్ ఒప్పందానికి కట్టుబడి కొనుగోలు జరగాలని ఒక వేళ రైతులు బయట మార్కెట్‌లో ఎక్కువ ధరకు ఇతర ట్రేడర్లకు పంట అమ్ముకోవాలని భావిస్తే వారికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలన్నారు. జిల్లాలో ప్రస్తుత సీజన్‌లో ఎర్రజొన్న సాగు చేసిన విస్తీర్ణం, పంట దిగుబడులు రైతులతో ఆయా కంపెనీల వ్యాపారులు కుదుర్చుకున్న ఒప్పందం, స్వేచ్ఛ విపనిలో ఎర్రజొన్న పంటకు లభిస్తున్న ధర, మార్కెట్ డిమాండ్ తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రైతుల నుంచి సేకరించిన ఎర్రజొన్న పంటను ఢిల్లీ, పంజాబ్, హర్యాన, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తామని అక్కడ ఎర్రజొన్న పశువులకు దానగా వినియో గిస్తారని సీడ్ కంపెనీల ప్రతినిధులు కలెక్టర్‌కు వివరించారు. ఈసారి పంటకు మార్కెట్‌లో ఆశించిన రీతిలోనే ధర పలుకుతుందని పంట వెరైటీలను బట్టి క్వింటాలుకు రూ.3500 నుంచి 4300 ధర లభిస్తుండగా తాము కూడా రైతులతో అదేరీతిలో బై బ్యాక్ ఒప్పందాలు కుదుర్చుకోవడం జరిగిందన్నారు. 15రోజుల్లో పంట పెద్దఎత్తున చేతికి అందుతుందని క్వింటాలుకు కనీస మద్దతు ధర రూ.3500 చెల్లిస్తామని ట్రేడర్లు హామీ ఇచ్చారు. ఎట్టి పరిస్థితుల్లో రైతులు నష్టపోకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని వ్యవసాయ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వ్యాపారులు సిండికేట్ అయి రైతులను మోసగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్‌హుస్సేన్, ఏడీఏలు, ఏవోలు, విత్తన కంపెనీ ప్రతినిధులు, పాల్గొన్నారు.

పీవీకి భారతరత్న

- పీవీ చిత్రపటానికి ఘన నివాళులు



దివంగత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారం ప్రకటించడంతో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ శుక్రవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ హాల్‌లో బీజేపీ ఎమ్మెల్యేలతో కలిసి పీవీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్‌పాల్ మాట్లాడుతూ.. ప్రధాని హోదాలో పీవీ నర్సింహారావు దేశానికి అందించిన సేవలను గుర్తించి అత్యున్నత పురస్కారం అందించడం ప్రధానీ మోదీ సంస్కారానికి నిదర్శనమన్నారు.

అయ్యప్ప క్షేత్రంలో
ఘనంగా మండల పూజ

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 9: మండలంలోని ఉప్లూర్ గ్రామంలో గల రుషి కొండ అయ్యప్ప క్షేత్రంలో కొలువై ఉన్న స్వామి అయ్యప్పకు శుక్రవారం మండల పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ కొడగండ్ల శ్రీరామచరణ్‌శర్మ, హిందూ ధర్మం ఆస్థాన పండితుల అద్వర్యంలో మండలపూజా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి వేదమంత్రోచ్ఛరణల మధ్య అభిషేకం, యజ్ఞ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వామి మేడారం భూమన్న, బద్దం తిరుపతిరెడ్డి గాజుల రాజ్‌వీర్, క్యాతం మల్లికార్జున్ దంపతులతో పాటు గోపిడి భూమన్న రుషికొండ అయ్యప్పక్షేత్రం, అయ్యప్పసేవాలసమితి సభ్యులు, భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా భీమేశ్వర స్వామి ఉత్సవాలు
● భక్తులతో కిక్కిరిసిన ఆలయం


ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు

తాడ్వాయి, ఫిబ్రవరి9: మండలంలోని సంతాయిపేట శ్రీభీమేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం మాఘఅమావాస్య సందర్భంగా భీమేశ్వర స్వామి ఉత్సవాలు కన్నుల పండుగా సాగాయి. ఆలయ ఆవరణంతా భక్తులతో కిక్కిరిసిపోయింది. ప్రతీ సంవత్సరం మాఘ అమావాస్యం సందర్భంగా స్వామి స్వయంభూలింగాన్ని దర్శించుకుని భక్తులు పునీతులవుతారు. మండలంలోని భక్తులే కాకుండా ఇతర మండలాల నుంచి వచ్చిన భక్తులు పెద్దఎత్తున హాజరై దర్శనం చేసుకున్నారు. ఉత్తరం నుంచి దక్షిణం వైపునకు భీమేశ్వరవాగు ప్రవహిస్తుండడంతో ఈ వాగులో మాఘ అమావాస్య సందర్భంగా స్నానంచేస్తే పుణ్యం లభిస్తుందని భక్తుల నమ్మకం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆర్టీసీ డిపో వారు ప్రత్యేక బస్సులను నడిపారు. ప్రముఖ శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి ప్రత్యేక కంటి వైద్యశిబిరం ఏర్పాటుచేయించడంతో భక్తులు పరీక్షలు చేయించుకుని ఉచితంగా కంటి అద్దాలుఅందుకున్నారు. ఆలయానికి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు హాజరై పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని తెలిపారు. అదేవిధంగా కృష్ణాజీవాడి, చిట్యాల గ్రామాలలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయాలకు విచ్చేసిన భక్తులకు అన్న ప్రసాదం పంపిణీచేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ బాపురెడ్డి, ప్రతినిధులు శ్రీనివాస్, రాజేశ్వర్‌రావు, సతీష్, కృష్ణమోహన్, రాజిరెడ్డి, రాజేశ్వర్‌రావు, శ్రీనివాస్, భాస్కర్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కామారెడ్డి అదనపు కలెక్టర్

రేపు గురుకుల పాఠశాలల ప్రవేశపరీక్ష

కామారెడ్డిటౌన్,ఫిబ్రవరి 9:తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2024-25 విద్యాసంవత్సరానికి 5వ తరగతిలో చేరబోయే విద్యార్థుల కోసం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. ఈ ప్రవేశపరీక్ష ఏర్పాట్లపై ఆయా పాఠశాలల ప్రిన్సిపల్‌తో కలెక్టర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో 11 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 3,986 మంది విద్యార్థులు ఈ ప్రవేశపరీక్షకు హాజరవుతున్నారని తెలిపారు. విద్యార్థులు సకాలంలో ఆదివారం ఉదయం 10గంటలకు సంబంధిత పరీక్ష కేంద్రాలకు హాజరుకావాలని కోరారు. ఉదయం 11 గంటల నుంచి 1 గంటల వరకు పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు.

పది రోజుల్లో చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించాలి

● ఉత్తర్వులను జారీ చేసిన హైకోర్టు

ఆర్మూర్ టౌన్, ఫిబ్రవరి 9: ఇటీవల నిర్వహించిన అవిశ్వాస పరీక్ష నెగ్గిందని పది రోజుల్లో మున్సిపల్ చైర్‌పర్సన్‌ను ఎన్నుకోవాలని శుక్రవారం హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 4న అవిశ్వాస పరీక్ష నిర్వహించగా 25మంది కౌన్సిల్ సభ్యులు హాజరుకాగా 24మంది అవిశ్వాస పరీక్షకు మద్దతుగా ఓటు వేయడం జరిగింది. దీంతో అధికారులు అవిశ్వాస పరీక్ష నెగ్గిందని ప్రకటించారు. అప్పటి మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత హైకోర్టును ఆశ్రయించగా శుక్రవారం హైకోర్టు కేసును కొట్టివేస్తూ అవిశ్వాస పరీక్షకు హాజరైన సభ్యులలో 2/3 సభ్యులు 17మంది ఓటు వేస్తే సరిపోతుందని అవిశ్వాస పరీక్ష నెగ్గిందని పది రోజుల్లో చైర్‌పర్సన్ ఎన్నిక చేయాలని అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

సిరికొండ, ఫిబ్రవరి 9: హన్మకొండ జిల్లాలో శనివారం నుంచి జరిగే రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు సిరికొండకు చెందిన జీ.హర్షవర్ధన్ ఎంపికైయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సయ్య తెలిపారు. అండర్-18 సాఫ్ట్‌బాల్ జిల్లా జట్టుకు హర్షవర్ధన్ ప్రాతినిధ్యం వహిస్తారని ఆయన తెలిపారు. క్రీడాపోటీల్లో హర్షవర్ధన్ మంచి ప్రదర్శన ప్రదర్శించి మండలానికి, జిల్లాకు పేరు తేవాలని ఆయన కోరారు. జిల్లా క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి జాతీయ స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.

డిచ్‌పల్లి: గత నెల 30న ఆర్మూర్‌లో జరిగిన నిజామాబాద్ జిల్లా జూనియర్ సాఫ్ట్‌బాల్ బాలుర జట్టులో మిట్టాపల్లిపాఠశాల విద్యార్థి బుక్యా దేవేందర్ పాల్గొని చక్కని ప్రతిభను కనబర్చి ఈనెల 10 నుంచి 11వరకు హన్మకొండ జిల్లా ధర్మసాగర్‌లో జరిగే 9వ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుజన్‌కుమార్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబర్చాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా దేవేందర్‌ను వ్యాయామ ఉపాధ్యాయులు గంగమోహన్, ఉపాధ్యాయ బృందం అభినందించింది.



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

జిల్లాస్థాయి సైన్స్ పోటీలకు ఎంపిక

ఏర్గట్ల, ఫిబ్రవరి 9: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సైన్స్ డేను పురస్కరించుకొని జిల్లా స్థాయి సైన్స్ పోటీలకు విద్యార్థులను ఎంపిక చేసినట్లు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కొమరగిరి కృష్ణాచారి తెలిపారు. అందులో భాగంగా పాటలు, కవిత్వం, పేయింటింగ్, స్పీచ్ పోటీలు నిర్వహించగా ఏర్గట్ల పాఠశాల నుండి స్పీచ్ పోటీలో అస్నిహా బాను. పేయింట్‌లో నిహారిక, పాటల పోటీలకు సాయి సిద్ధార్థ, కవిత్వంలో తడపాకల్ పాఠశాలకు చెందిన రింశా గెలుపొంది జిల్లా స్థాయిలో ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి ఆనంద్‌రావు, మండల సైన్స్ కన్వీనర్ రాజశేఖర్, ఆయా పాఠశాలల విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మామిడిపల్లిలో మండలస్థాయి సైన్స్ పోటీలు

ఆర్మూర్ రూరల్, ఫిబ్రవరి 9: జాతీయస్థాయి సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ శాస్త్ర సాంకేతిక మండలి, పర్యవరణ పరిరక్షణ కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి ఉన్నత పాఠశాలలో మండలస్థాయిలో విద్యార్థులకు నాలుగు విభాగాలలో పరీక్షలు నిర్వహించారు. ఉపన్యాసంలో ప్రవీణ, పాటల పోటీలలో ఐశ్వర్య, కవిత్వంలో నందనశ్రీ, చిత్రలేఖనం పోటీలో సిద్ధార్థ్ గెలుపొందినట్టు పాఠశాల హెచ్‌ఎం రవీందర్ తెలిపారు. గెలుపొందిన విద్యార్థులు ప్రతీ మండలం నుంచి నలుగురు విద్యార్థులను ఎంపిక చేస్తారని వారన్నారు. ఈనెల 12వ తేదీన నిజామాబాద్‌లో జరగనున్న జిల్లాస్థాయి పోటీలలో పాల్గొంటారని, ఈ పోటీలలో ప్రతిభ చూపిన వారిని ఈనెల 28వ తేదీన సైన్స్ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సన్మానిస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, మల్లేష్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

ఆర్మూర్ రూరల్, ఫిబ్రవరి 9: ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్ గ్రామంలో పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ప్రతినిధులు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కాంత్, రోటరీ అధ్యక్షుడు పట్వారి గోపికృష్ణ విజేతలకు బహుమతులు అందజేశారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రతీఒక్కరికి అవగాహన ఉండాలని, వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రాజ్‌కుమార్, విజయసారథి, పంచాయతీకార్యదర్శి సుకన్య, హెచ్‌ఎం ఇందిరా, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో అక్రమ నిర్మాణం సీజ్

ఆర్మూర్ టౌన్, ఫిబ్రవరి 9: మున్సిపల్ పరిధిలోని మహాలక్ష్మీ కాలనీలో ఓ అక్రమ నిర్మాణాన్ని శుక్రవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సీజ్ చేశారు. ఇంటి యాజమాని మూడంతస్తుల భవన అనుమతి తీసుకొని ఐదు అంతస్తులు నిర్మించారని సెట్‌బ్యాక్ లేకుండా నిర్మాణం జరగడంతో మున్సిపల్ చట్టం ప్రకారం ఆ భవనాన్ని నిలిపి వేసినట్టు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహాన్ తెలిపారు. వారి వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అశోక్‌సింగ్, సర్వేయర్ షికారి రాజు, టౌన్‌ప్లానింగ్ అధికారి హరిష్, ఎస్సై గంగాధర్, ఫైర్‌స్టేషన్ ఎస్సై మధుసూదన్, మున్సిపల్ సిబ్బంది అశోక్, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.



ఆర్మూర్‌లో అక్రమ నిర్మాణాన్ని సీజ్ చేస్తున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం

గన్నారంలో అనుమానిత మహిళ సంచారం

● పొంతనలేని సమాధానాలు చెప్పడంతో పోలీసులకు అప్పగింత ● గేదెల మంద వద్ద మరో అనుమానితున్ని పట్టుకున్న స్థానిక యువకులు ● నవీపేట వారసంతాలో ముగ్గురికి దేహశుద్ధి ● ఇటుక బట్టి కార్మికులుగా గుర్తించిన పోలీసులు

ఇందల్‌వాయి, ఫిబ్రవరి 9: మండలంలోని గన్నారం గ్రామంలో అనుమానస్పదంగా సంచరిస్తున్న మహిళను శుక్రవారం స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అనుమానంగా సంచరిస్తున్న ఆమెను మహిళలు ప్రశ్నించడంతో పొంతన లేకుండా సమాధానాలు చెప్పడంతో చితకబాధి పోలీసులకు అప్పగించారు. ఇటీవల జిల్లాలో పలుచోట్ల వరుసగా చిన్నపిల్లలను ఎత్తుకెళ్తున్న ఘటనలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో మహిళలను పట్టుకుని పోలీసులకు అప్పగించారు.మహిళను పోలీసులు విచారించగా ఆమె సిరికొండ మండలానికి చెందిన కండ్లకోయ పోచవ్వగా గుర్తించామని పోలీసులు తెలిపారు. ఆమె అక్క లక్ష్మి కూతురికి అమ్మోరు సోకడంతో కొందరు తెలిసిన వ్యక్తులు వారి కుటుంబసభ్యులకు కొన్ని గ్రామాల్లో బిక్షాటన చేయాలని సూచించినట్లు పోలీసుల విచారణలో తేలింది.అలా వచ్చిన డబ్బులు, బియ్యంతో పండుగ చేయాలని తెలుపడంతో భిక్షమెత్తెందుకు తాను గన్నారం గ్రామానికి వచ్చినట్లు తెలిపింది. ఆమెకు పోలీసులు తహశీల్దార్ వెంకట్రావ్ ఎదుట బైండోవర్ చేస్తామన్నారు.



నవీపేటలో అనుమానితుల వద్ద వివరాలు సేకరిస్తున్న ఎస్సై యాదగిరి

● మరో అనుమానిత వ్యక్తికి దేహశుద్ధి

మండలంలో గన్నారం గ్రామంలో గేదేల మంద వద్ద అనుమానితంగా సంచరిస్తున్న వ్యక్తిని గ్రామ యువకులు పట్టుకుని చితకబాదారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఆయనను స్టేషన్‌కు తీసుకొచ్చిన పోలీసులు బోధన్ గ్రామంఅని మతిస్థిమితం లేక రైలు నుంచి ఇందల్‌వాయిలో దిగి పంటపోలాల వద్ద నుంచి నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని గ్రామస్తులు పట్టుకున్నట్లు తెలిపారు. గ్రామస్తులకు సరైన సమాధానాలు చెప్పక పోవడంతో చితకబాధి పోలీసులకు అప్పగించారు.

● పిల్లల కిడ్నాపర్‌లుగా అనుమానం

నవీపేట: మండలకేంద్రంలో శుక్రవారం సాయంత్రం పిల్లల కిడ్నాపర్‌లుగా అనుమానంతో ముగ్గురు వ్యక్తులను స్థానికులు చితకబాదారు. నవీపేటలో ప్రతి శుక్రవారం వారంత సంత కొనసాగుతుండగా సంతలో కూరగాయలు, ఇతర వస్తువులను కొనుగోలు చేయడానికి భరత్, అశోక్, జగదీష్ అనే ముగ్గురు ఇటుక బట్టి కార్మికులు సంతకు వచ్చారు. ఈ సమయంలో ముగ్గురు మద్యం తాగి ఉన్నారు. సంతలో నడిచి వెళ్లే సమయంలో ఒక మహిళ చేతికి వీరు తగిలారు. దీంతో ఆమె వీరిని చూసి పిల్లలను ఎత్తుకుపోయే వారిగా భావించి స్థానికులకు విషయం తెలిపింది. దీంతో అక్కడే ఉన్న పలువురు స్థానికులు ఈ ముగ్గురిని చేతులు, కర్రలతో చితకబాదారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ యాదగిరి గౌడ్ తమ సిబ్బందితో వెళ్లి ముగ్గురిని చికిత్స నిమిత్తం నవీపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంబంధిత వ్యక్తులు మహంతంలో ఇటుక బట్టిలో పని చేసే కార్మికులు అని వీరు ఆదిలాబాద్‌కు చెదిన వారని నెల రోజుల నుండి మహంతం ఇటుక బట్టిలో పని చేస్తున్నారని ఎస్ఐ పేర్కొన్నారు. అనుమానస్పదంగా ఎవరైనా వ్యక్తులు సంచరిస్తే వారిపై దాడి చేయకుండా పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే రోగాలు ధరిచేరవు

● జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

నందిపేట, ఫిబ్రవరి 9: పల్లెల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే రోగాలు దగ్గరికి రావని జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. శుక్రవారం నందిపేట మండలంలోని బజార్‌కొత్తూర్, నందిపేట గ్రామాలలో నిర్మించిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాలలో ఆయన స్వయంగా మురికికాల్వలను శుభ్రం చేసి పిచ్చిమొక్కలను తొలగించి ట్రాక్టర్‌లో పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనుషుల వలే గ్రామాలను కూడా శుభ్రంగా ఉంచుకోవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి ఈ కార్యక్రమాలను చేస్తుందన్నారు. దీనికి అందరు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల కోఆప్షన్‌సభ్యుడు సయ్యద్‌హుస్సెన్, నాయకులు నర్సాగౌడ్, గంగారెడ్డి, బాబురాజ్, మాజారుద్దీన్, అరుట్ల రమేష్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



బజార్‌కొత్తూర్‌లో చెత్తను ఎత్తి ట్రాక్టర్‌లో పోస్తున్న జడ్పీ చైర్మన్

రవీందర్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

● కాంగ్రెస్ రుద్రూరు మండల అధ్యక్షుడు

రుద్రూరు, ఫిబ్రవరి 9: మాజీ ఎమ్మెల్యే, బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ఏనుగు రవీందర్‌రెడ్డిపై ఉమ్మడి జిల్లాల డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై రుద్రూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన వ్యక్తంచేశారు. శుక్రవారం రుద్రూరు మండల కేంద్రంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు తోట అరుణ్‌కుమార్ మాట్లాడుతూ బాన్సువాడ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. స్థాయి మరిచి రవీందర్‌రెడ్డిపై మరోకసారి అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఖబర్దార్ అని హెచ్చరించారు. ఇందులో మండల ఉపాధ్యక్షుడు నడిపింటి నగేష్, ఓబీసీ మండల అధ్యక్షుడు కర్కే అశోక్, కిసాన్ కేత్ మండల అధ్యక్షుడు అడప సాయిలు, రుద్రూరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పార్వతి ప్రవీణ్, ఎంపీటీసీ గౌస్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వర్ని: బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఏనుగు రవీందర్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై సహించేది లేదని డీసీసీ డెలిగేట్ యలమంచిలి శ్రీనివాస్ రావు స్పష్టం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఆయన ఇద్దరు కుమారులు నియోజకవర్గంలో దోపిడికి పాల్పడి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టును అడ్డం పెట్టుకుని వేలాది రూపాయల కుంభకోణానికి పాల్పడింది ఎమ్మెల్యే అనుచరులని ఆయన మండిపడ్డారు. రైతాంగం వద్ద ధాన్యం కొనుగోలు చేసి ఎంఎస్‌జీ ద్వారా కొనుగోలు చేసి కోట్లాది రూపాయలు స్వాహా చేసిన ఘనత ఎమ్మెల్యే పోచారంది కాదా అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో పేద ప్రజలు ఇళ్లు నిర్మించుకుంటే వారి వద్ద నుండి మూడేసి బిల్లులు కాజేసిన ఘనత పోచారంకు చెందిందేనని ఆరోపించారు. తన ఇద్దరు కుమారులను వెనుకేసుకుని వచ్చి కోట్లాది రూపాయలు స్వాహా చేసి అవినీతి ఆరోపణలు కాంగ్రెస్‌పై నెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇందులో కులకర్ణి సురేష్, గంగప్ప, ప్రసాద్, కూనిపూర్ రాజిరెడ్డి, రాంరెడ్డి, నారెడ్ల సాయిలు, బాలు ఉన్నారు.

పర్యాటక కేంద్రాల ఏర్పాటుకు ప్రాధాన్యత

నందిపేట, ఫిబ్రవరి9: రాష్ట్రంలో పర్యాటక కేంద్రాల ఏర్పాటుకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్టు రాష్ట్ర ఫారెస్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారి రంజిత్‌నాయక్ తెలిపారు. శుక్రవారం నందిపేట మండలంలోని ఉమ్మెడ శివారులో ఉన్న గోదావరి పరివాహక ప్రాంతాన్ని ఆయన జిల్లా ఫారెస్టు అధికారి వికాస్‌మీనతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మెడలో ఐదు ఎకరాలలో పర్యాటక కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని పేర్కొన్నారు. ఇందులో బోటింగ్, రీసెర్ట్ సెంటర్‌లను ఏర్పాటు చేయడానికి త్వరలోనే హర్కిటెక్చర్ ప్రతిపాదనలు చేస్తారని తెలిపారు. అంతేగాకుండా పర్యాటకుల ఆకర్షణ కోసం వివిధ రకాల పనులను నిర్మిస్తామని రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ అధికారి రంజిత్‌నాయక్ వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్‌మీన, అధికారులు లక్ష్మణ్, శ్రీనివాస్, సుధాకర్, మాజీసర్పంచ్ రామడ పోశెట్టి, వీడీసీసభ్యులు, తదితరులు ఉన్నారు.

ఫారెస్ట్ అధికారుల స్థల పరిశీలన

డొంకేశ్వర్, ఫిబ్రవరి 9: ఈకో టూరిజం అభివృద్ధిలో భాగంగా ఫారెస్ట్ డెవలప్‌మెంట్ అటవీ అధికారులు శుక్రవారం నడ్కుడ, గాదేపల్లి గ్రామశివారులో రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన ఐదు ఎకరాల్లో ఏర్పాటు చేసిన స్థలాన్ని పరిశీలించారు. బోటింగ్, రిసార్ట్ ఏర్పాటుచేస్తామని ఎస్సారెస్పీ ట్యాండ్‌కు ఏటువంటి ఇబ్బందులు ఉండవదని సూచించారు. ఈకో టూరిజాం ఏర్పడడం వల్ల స్థానిక యువతకు ఉపాధి కల్పిస్తామని ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ డీఎఫ్ రంజిత్‌నాక్, జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్‌మీనా, అటవీ క్షేత్రధికారులు శ్రీనివాస్, లక్ష్మణ్, ఉప కక్షేత్రాధికారి సుధాకర్, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

'లబ్ధిధారుల జాబితా సిద్ధం చేయాలి'

ఏర్గట్ల, ఫిబ్రవరి 9: మహాలక్ష్మీ గ్యాస్ పథకం లబ్ధిదారుల జబితా సిద్ధం చేయాలని ఆర్మూర్ ఆర్డీవో వినోద్ కుమార్ అధికారులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపిడీవో కార్యాలయంలో రికార్డులకు పరిశీలించిన అనంతరం ప్రజాపాలన దరఖాస్తులో మహాలక్ష్మీ పథకానికి సంబంధించిన గ్యాస్ పథకంలో భాగంగా మండలంలో 2274 మందికి సంబంధించిన గ్యాస్ కనెక్షన్ వివరాలు తప్పులు గుర్తించామని వాటిని గ్రామ స్థాయిలో రెండు రోజుల్లో ఆన్‌లైన్‌లో సవరణ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ యూసుఫ్, ఎంపివో శివచరణ్, ఆర్ఐ సధానంద్, జీపి కార్యదర్శి జాకీర్ హుస్సేన్‌లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విద్యుత్ హామీ సర్వే

రుద్రూరు, ఫిబ్రవరి 9: రుద్రూరు మండల కేంద్రంలో శుక్రవారం విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారు. సర్వేలో వినియోగిస్తున్న విద్యుత్ వివరాలను సేకరిస్తూ ఇంటి యజమాని సంబంధించిన రేషన్ కార్డు, ఆధార్ కార్డు వివరాలను సేకరిస్తున్నారు. దీంతో ఉచిత విద్యుత్ వినియోగానికి అర్హులైన వారిని గుర్తిస్తున్నారు. ఈ ఇంటింటి సర్వేలో విద్యుత్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారంటి పథకంలో భాగంగా శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాలలో రూ.500 గ్యాస్ సిలిండర్ గృహజ్యోతి పథకాల దరఖాస్తులను అధికారులు, ట్రాన్స్‌కో అధికారులు పరిశీలించారు. శుక్రవారం తొర్లికొండ గ్రామంలో గ్యాస్ సిలిండర్‌పై వచ్చిన దరఖాస్తులను ఇంటింటికి వెళ్ళి ఎంపీడీవో బ్రహ్మానందం పరిశీలించారు. ప్రజలు ఈ పథకాల కోసం సర్వే చేయడానికి వచ్చిన అధికారులకు సహకరించాలని కోరారు.

గంగస్నానికి వెళ్లి ఒకరి మృతి

డొంకేశ్వర్, ఫిబ్రవరి 9: మండలంలోని నికల్‌పూర్ గ్రామానికి చెందిన సాద భోజన్న(38) అనే వ్యక్తి గంగాస్నానికి వెళ్లి నీటిలో మునిగి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం గ్రామదేవతలకు జలాభిషేకానికి గంగజలాలను తీసుకురావడానికి వెళ్ళిన భోజన్న గంగనదికి వెళ్లారు. గంగనదిలో స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. స్థానికులు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వగా సంఘటన వద్దకు చేరుకున్న కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా రోదించారు. మృతుడు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఎస్సై రాహుల్ తెలిపారు.

కమ్మర్‌పల్లిలో ఉరివేసుకుని ఒకరు..

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 9: కమ్మర్‌పల్లి మండలకేంద్రానికి చెందిన చిరునాంజి(వడ్ల) బాలకిషన్ (54) అనేవ్యక్తి శుక్రవారం తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. గత కొంత కాలంగా పక్షవాంతో బాదపడుతున్న బాలకిషన్ తగు చికిత్సలు పొందుతున్నా ఫలితం లేక పోగా కాళ్లు, చేతులు సహకరించకపోవడంతో మానసికంగా కుంగిపోయి జీవితంపై విరక్తి చేంది శుక్రవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో నైలాన్ తాడుతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మరణించినట్లు ఎస్సై తెలిపారు. భార్య ధనలక్ష్మీ పిర్యాదుమెరకు శవపంచినామజరిపించి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసునమోదు చేసి దర్యప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత..

కోటగిరి, ఫిబ్రవరి 9: పొతంగల్ మండలంలోని చేతన్ నగర్ గ్రామానికి చెందిన అమ్రాపాలి(28)అనే వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. అమ్రాపాలి గత కొంతకాలంగా తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతుంది. గురువారం రాత్రి కడుపు నొప్పి తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నం చేసింది. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందగా మృతురాలి తల్లి దైవశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మైలారంలో ఒకరి ఆత్మహత్య

ధర్పల్లి, ఫిబ్రవరి 9: మండలంలోని మైలారం గ్రామంలో అల్లూరి పెద్ద గంగారం(62)అనే వ్యక్తి శుక్రవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ వంశీకృష్ణరెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన గంగారం మద్యానికి బానిసై ఈనెల 8న మద్యం సేవించి కుటుంబసభ్యులతో గొడవకు దిగాడు. శుక్రవారం ఉదయం ఇంటిలోని గది తెరువగా ఉరివేసుకుని మృతి చెందినట్లు పోలీసులకు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్లాస్టిక్ వాడకంపై అవగాహన

ముప్కాల్, ఫిబ్రవరి9: ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ భూమిలో కరగడానికి కొన్నేళ్లు పడుతుందని, దీని వల్ల పర్యవరణ కాలుష్యం ఏర్పడుతుందని ముప్కాల్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. శుక్రవారం ముప్కాల్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వస్తువుల నిషేదంపై పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. ఇందులో ఎంపీడీవో దామోదర్, తహసీల్దార్ వనజరాణి, నాయకులు నర్సారెడ్డి, సామ వెంకటరెడ్డి, మునీరోద్దిన్, లయన్స్ క్లబ్ సభ్యులు, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



అస్వస్థతకు గురైన విద్యార్థులను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

టీయూలో హాస్టల్ విద్యార్థుల అస్వస్థత

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 9: తెలంగాణ యూనివర్సిటీ బాలికల వసతి గృహంలో శుక్రవారం ముగ్గురు విద్యార్థిని అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం జరుగుతున్న సెమిస్టర్ పరీక్షలకు విద్యార్థులు హాజరయ్యారు. ముగ్గురు విద్యార్థినులు అల్పాహారం తినగా కళ్లు తిరిగి ఫిట్స్ రావడంతో పడిపోయారు. వెంటనే గమనించిన హాస్టల్ కేర్‌మేకర్ అస్వస్థతకు గురైన ఎంబీఏ విద్యార్థినినులు పల్లవి, అశ్విని, అర్పిణి వెంటనే అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. విశ్వవిద్యాలయంలో ఆసుపత్రి ఉన్న వైద్యసిబ్బంది లేకపోవడంతో తరచు ఈ ఘటనలు జరుగుతున్నాయని ఇటీవంటి ఘనటలు జరగడానికి అధికారుల వైఫల్యమే కారణమని యూనివర్సిటీ విద్యార్థినిలతో చెలగాటం ఆడుతున్నారని ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు శ్రీశైలం మండిపడ్డారు. అధికారులు వెంటనే హాస్టల్‌లో మౌళిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలో విద్యార్థినిలకు వైద్యసిబ్బందిని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహేష్, రాజేందర్, సాగర్, ప్రశాంత్, శివ, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 9: మండలంలోని చందమియాబాగ్‌తాండా వద్ద 44వ జాతీయరహదారిపై గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో పడకల్ గ్రామానికి చెందిన రఘు, అతని తండ్రికి గాయాలైనట్టు ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. పడకల్ గ్రామానికి చెందిన రఘు, తండ్రి బైక్‌పై డిచ్‌పల్లి నుంచి స్వగ్రామానికి వస్తుండగా చందమియాబాగ్‌తాండా వద్ద మూల మలుపు వద్ద డిచ్‌పల్లి నుంచి వస్తున్న హర్యానకు చెందిన ట్రక్కు వాహనం అదుపుతప్పి బైక్‌ను కొట్టింది. ఈ ప్రమాదంలో రఘు, తన తండ్రికి గాయాలైనట్టు ఎస్సై తెలిపారు. రఘు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

మొబైల్‌షాప్‌లో భారీ అగ్నిప్రమాదం

ఖిల్లా, ఫిబ్రవరి 9: నగరంలోని ఆర్‌పీ రోడ్డు రైల్వేస్టేషన్ సమీపంలోని మొబైల్‌షాప్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో షాపులోని కంప్యూటర్లు, సీసీ కెమెరాలు, ల్యాప్‌టాప్‌లతో పాటు వివిధ రకాల సెల్‌ఫోన్లు అగ్నికి ఆహుతయ్యాయి. హైటెక్ మొబైల్ షాప్‌లో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన అగ్నిప్రమాదంలో దాదాపు రూ.లక్ష విలువ గల ఆస్తి నష్టం జరిగింది. ఈ ప్రమాదం షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదం జరిగినట్లు అగ్నిమాపక శాఖాధికారులు తెలిపారు. గురువారం రాత్రి ప్రతిరోజులాగే షాపును మూసివేసి వెళ్లానని యజామాని ముఖీమ్ తెలిపారు. ఉదయం షాపు నుంచి పొగలు రావడాన్ని గుర్తించిన స్థానికులు అగ్నిమాపక శాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అగ్నిమాపక శాఖాధికారులు నర్సింగ్ రావుతన సిబ్బందితో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు. మంటలు పక్క దుకాణాలకు వ్యాప్తి చెందకుండా అన్ని చర్యలు తీసుకున్నారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది.

టిప్పర్ యజమానికి జరిమానా

నవీపేట, ఫిబ్రవరి 9: మండలంలోని ఫకీరాబాద్ సమీపంలో గురువారం తెల్లవారుజామున అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పర్‌ను పట్టుకోగా సంబంధిత టిప్పర్ యజమానికి శుక్రవారం 10వేల రూపాయల జరిమాన విధించడం జరిగిందని తహసీల్దార్ ధన్వాల్ తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.



మాట్లాడుతున్న మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకెట రవి

'తప్పుడు ప్రచారాలను మానుకోవాలి'

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 9: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల మెరకు ఒక్కోపతకం అములు చేస్తూ పోతుంటే పథకాలు రాష్ట్రంలో పథకాలు అమలు కావడం లేదని అనడం అసత్య ప్రచారమని బీఆర్ఎస్ నాయకులు ప్రజలను అయోమయానికి గురి చేసేవిధంగా చేస్తున్న అసత్య ప్రచారాలు మానుకోవాలని కాంగ్రెస్ మండల నాయకులు హితవుపలికారు. మండల పార్టీ అధ్యక్షుడు సుంకెట్ రవి అధ్యక్షతన జరిగిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిస్తే కళ్యానలక్ష్మీ, ఆసరా, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ లాంటి పథకాలు నిలిచిపోతాయని తప్పుడు ప్రచారం చేశారని శుక్రవారం మండలకేంద్రంలో కల్యా ణలక్ష్మీ చెక్కుల పంపిణీ ప్రత్యేక నిదర్శనమన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి శ్రీనివాస్, సల్లూరి గణేష్ గౌడ్, సుంకెట శ్రీనివాస్, సింగిరెడ్డి శేఖర్, ప్రదీప్, జగదీశ్ అవారి శ్రీనివాస్, తదతరులున్నారు.

'బాలకార్మికులు ఉంటే చర్యలు'

ముప్కాల్, ఫిబ్రవరి 9: బాల్కొండ ఇటుక బట్టీల దగ్గర బాల కార్మికులను పెట్టుకుంటే చర్యలు తప్పవని సై గోపి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని ఇత్వార్‌పేట్, బుస్సాపూర్ గ్రామాలలోని ఇటుక బట్టీలను ఆయన తనిఖీ చేశారు. ఇటుక బట్టీల వద్ద బాల కార్మికులు లేకుండా చూడాలని, చట్టవిరుద్ధంగా బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలకు అనుగుణంగా బట్టీలు నిర్వహించాలని ఆయన వివరించారు.

బాధితుడికి ఫోన్ అప్పగింత

ముప్కాల్, ఫిబ్రవరి 9: బాల్కొండ గ్రామానికి చెందిన షేక్ సలీం అనే వ్యక్తి మొబైల్ ఫోన్‌ను ఈనెల 14న వన్నెల్(బి)చౌరస్తాలో పోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో సీఈఐఆర్ సిస్టం ద్వారా శుక్రవారం ఎస్సై గోపి బాధితుడికి ఫోన్‌ను అందజేశారు.

రేషన్‌బియ్యం పట్టివేత

మోపాల్, ఫిబ్రవరి 9: మండలంలోని కులాస్‌పూర్-కంజర గ్రామాల సరిహద్దులో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు జిల్లా పౌరసరపరాల శాఖ అధికారి చంద్రప్రకాష్ తెలిపారు. శుక్రవారం కంజర గ్రామ పరిధిలో డీసీఎం వాహనంలో 18 క్వింటాళ్ల, కులాస్‌పూర్ గ్రామ పరిధిలో 11 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు వాహనాలను తనిఖీ చేయగా.. అవి రేషన్ బియ్యంగా పోలీసులు తేల్చారు. దీంతో సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు వారు తెలిపారు. అలాగే మోపాల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.



అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్న అధికారులు



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్

రక్తదానం చేయడం అభినందనీయం : అదనపు కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 9: సమాజంలో ఉన్నతమైన స్థానంలో ఉండి ఆపదలో ఉన్నవారి కోసం రక్తదానం చేయడం అభినందనీయమని అదనపు కలెక్టర్ యాదిరెడ్డి అన్నారు. శుక్రవారం పీఆర్‌టీయు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నగరంలోని సుభాష్‌నగర్‌లో గల పీఆర్‌టీయూ భవన్‌లో 80మంది ఉపాధ్యాయులు రక్తదానం చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఇలాంటి సేవ కార్యక్రమాల్లో పాల్గొనడం గొప్ప విషయమన్నారు. రక్తదాన శిబిరానికి సహకరించిన రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులకు పీఆర్‌టీయూ అధ్యక్ష, కార్యదర్శులు మోహన్‌రెడ్డి, వెంకటేశ్వరగౌడ్‌లు ధన్యావాదాలు తెలి పారు. ఈ సందర్భంగా సంఘ సీనియర్ కార్యకర్తలు సచ్చిదానందం, రామ రావు, చలం, తదితరులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు పెంట జలందర్, రచ్చ మురళీ, రవీందర్ గౌడ్, లక్ష్మణ్ పటేల్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

24నుంచి టెక్నికల్ కోర్స్ పరీక్షలు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 9: ఈనెల 24నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ పరీక్షల్లో భాగంగా డ్రాయింగ్ లోయర్‌గ్రేడ్, హైయ్యర్‌గ్రేడ్ పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి 4.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్‌వీ.దుర్గాప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా ఈనెల 25న టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్‌గ్రేడ్, 26, 27వ తేదీల్లో టైలరింగ్, ఎంబ్రాయిడరీ హైయ్యర్ గ్రేడ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు, అర్హులైన అభ్యర్థులు తమ హాల్ టికెట్లను బీఎస్‌ఈ.తెలంగాణా వెబ్‌సైట్ నుంచి పొందాలని ఆయన తెలిపారు.

టీయూలో ఎంఈడీ పరీక్షలు ప్రశాంతం

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 9: తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో ఎంఈడీ 1వ, 2వ, 3వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్, 2వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు గిరిరాజ్ కళాశాలలో ప్రశాంతంగా జరిగాయని ఆడిట్‌సెల్ డైరెక్టర్ గంట చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. ఈ పరీక్షలకు 40 విద్యార్థులకు గాను 40 మంది హాజరయ్యారని ఆయన పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంలో రెండవ సంవత్సరం 3వ సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ఫీజు ఈనెల 19వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించుకునే అవకాశం ఉందన్నారు. 20తేదీ వరకు రూ.100, 22వ తేదీ వరకు రూ.200లు అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందని పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ అరుణ తెలిపారు. అంతేకాకుండా విద్యార్థులు పూర్తి వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆమె పేర్కొన్నారు.

రాంపూర్ ఉప కాలువ పరిశీలన

నవీపేట, ఫిబ్రవరి 9: మండలంలోని రాంపూర్‌లో అలీసాగర్ ఎత్తిపోతల పథకంకు సంబంధించిన డీ50/5 ఉప కాలువను ఇరిగేషన్ ఏఈ శ్రీధర్ శుక్రవారం పరిశీలించారు. శుక్రవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో "రాంపూర్‌కు చేరని అలీసాగర్ ఎత్తిపోతల సాగునీరు" అనే వార్తకు స్పందించిన ఆయన సంబంధిత ఉప కాలువను పరిశీలించారు. ఫత్తేనగర్ సమీపంలో ఉప కాలువ పూడుకపోయిందని ఆయన పేర్కొన్నారు. శనివారం మరోమారు గ్రామాన్ని సందర్శించి స్థానిక రైతులతో మాట్లాడి సాగునీరు అందే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.



ధర్పల్లిలో సమ్మె నోటీసును అందజేస్తున్న కార్మికులు

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె

● మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె నోటీసు

సిరికొండ, ఫిబ్రవరి 9: మండలానికి చెందిన మధ్యాహ్న భోజన కార్మికులు తమ సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె చేస్తామని శుక్రవారం విద్యాశాఖాధికారులకు సమ్మె నోటీసు ఇచ్చారు. మధ్యాహ్న భోజన కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యాక్షుడు చక్రపాణి ఆధ్వర్యంలో మండలానికి చెందిన కార్మికులు శుక్రవారం విద్యాశాఖ కార్యాలయానికి వెళ్లి అధికారులకు నోటీసు అందజేశారు. తాము దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నందున సమ్మెకు సిద్ధమవుతున్నామని వారు ప్రకటించారు. తమ సమస్యలు పరిష్కరం కాకుంటే తప్పనిసరి పరిస్థితుల్లో ఈనెల 16నుంచి సమ్మె చేస్తామని వారు తెలిపారు. ఇందులో కార్మికులు లక్ష్మన్, ప్రమీల, తదితరులు ఉన్నారు.

ధర్పల్లి: మధ్యాహ్న భోజన కార్మికులు దేశావ్యాప్తంగా సమ్మెకు దిగుతున్నట్లు రాష్ట్ర ఉపాధ్యాక్షుడు చక్రపాణి తెలిపారు. శుక్రవారం సమ్మె నోటీసును ఎంపీడీవోకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వాలు ఎలాంటి సహాయసహకారాలు అందించకపోగా బడ్జెట్‌లో సైతం ఎలాంటి నిధులు కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులతో పాటు విద్యార్థుల సంరక్షణ చూడవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ నెల 16న దేశవ్యాప్తంగా సమ్మెకు పిలుపునిచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

పీవీకి భారతరత్న ప్రకటించడం..

తెలుగువారికి గర్వకారణం

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్



పీవీ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

పెద్ద బజార్, ఫిబ్రవరి 09: మాజీ ప్రధాని, రాజకీయ దిగ్గజం దివంగత పీవీ నరసింహరావుకు భారతరత్న ప్రకటించడం సంతోషకరమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్ అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని బీజేపీ కార్యక్రమంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దినేష్ మాట్లాడుతూ.. రాష్ట్రానికి, దేశానికి ఎనలేని సేవలు చేశారన్నారు. దేశం ఆర్థికం గా దివాళాతీసే సమయంలో సంస్కరణలు తీసుకువచ్చి మళ్లీ ఆర్థికంగా పపరిపుష్టి కల్పించారన్నారు. పీవీ నర్సింహారావు సేవలను కాంగ్రెస్ పార్టీ గుర్తించకున్నా, కేంద్రంలోని బీజేపీ సర్కార్ హయాంలో పీవీ నర్సింహారావుకు దేశ అత్యున్నత పురస్కారం "భారత రత్న" ఇచ్చి గౌరవించుకుందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు లక్ష్మినారాయణ, తదితరులు పాల్గొన్నారు. పద్మారెడ్డి, ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీవీకి భారతరత్న అభినందనీయం : ఎంపీ అర్వింద్

పెద్ద బజార్: మాజీ ప్రధాని దివంగత పీవీ నర్సింహారావుకు భారత రత్న అవార్డు ప్రకటించడం సంతోషకరమని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ఆనందం వ్యక్తం చేశారు. తన జీవిత కాలం కాంగ్రెస్ పార్టీకి సేవలందించిన పీవీకి ఎన్డీఏ హయాంలో కూడా సరియైన సముచిత స్థానం ఇవ్వలేదన్నారు. సిద్ధాంతాలను పక్కనపెట్టి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పీవీ నర్సింహారావుకు భారత రత్న అవార్డు ప్రకటించడం అభినందనీయమన్నారు. పీవీకి భారతరత్న ఇవ్వడంతో తెలుగువారి ఆత్మగౌరవం పెరిగిందన్నారు.

● **అంచెలంచెలుగా ఎదిగిన పీవీ : ఎమ్మెల్యే ధన్‌పాల్**

పెద్దబజార్: పీవీ నర్సింహరావు అంచెలంచెలుగా ఎదిగారని, ఆయనకు వేయి పడగలు అనే నవలను హిందీలో అనువదించినందుకు కేంద్ర సాహిత్య అకాడమీతో పాటు భారతరత్న అవార్డు వరించిందని బీజేపీ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఆయన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వరంగల్ జిల్లా నర్సంపేట లక్నాపల్లి గ్రామంలో రుకుంబాయి-సీతారామారావు దంపతులకు మారు మూల గ్రామంలో జన్మించారని అన్నారు. పీవీ రాజకీయంగా అంచెలం చెలుగా ఎదిగి రాష్ట్ర శాఖలో వివిధ పదవులు చేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చేసి కేంద్ర రాజకీయాల్లో కూడా కీలక పాత్ర పోషించార న్నారు. దేశ రాజధానిలో కూడా సేవలందించారని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ తెలుగోడి గొప్పతనాన్ని వెలిగెత్తి చాటిన వ్యక్తి పీవీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకచక్రేశ్వర ఆలయ వార్షికోత్సవం

● ప్రాచీన ప్రసిద్ధ శివాలయం ● ప్రత్యేక పూజలు, అభిషేకాలు ● శివ నామ స్మరణతో సకల శుభాలు ● తరలివచ్చిన భక్తులు



బోధన్ రూరల్, ఫిబ్రవరి 9: బోధన్ పట్టణంలో ప్రాచీనమైన ప్రసిద్ధ శైవక్షేత్రమైనటువంటి ఏకచక్రేశ్వర శివాలయంలో శుక్రవారం 65వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో వేద పండితుల మంత్రోచ్ఛరణలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో ప్రాతఃకాలం నుంచే స్వామి వారికి అర్చన, లఘున్యాస మహారుద్రాభిషేకం రుద్ర హోమము, వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సంధ్బంగా వేద పండితులు గణేష్ మహరాజ్ మాట్లాడుతూ చారిత్మక శివాలయం చాలా విశిష్టత మైనదని శివా నామ స్మరణతో సకల శుభాలు కలుగుతాయి అని వివరించారు. భక్తుల కోరికలు నెరవేర్చి ఇలవేల్పుగా మారడన్ని కొనియాడారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యకమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బిర్కూర్ బుజ్జి ప్రధన ఆర్చకుడు మహేష్ పఠక్ శివకుమార్ జేఏవో రాములు ధర్మకర్తలు లక్ష్మణ్ పటేల్, శ్యామ్, నర్సయ్య సేటు, మాధవి, బాబు, సుధకార్‌లతో, భక్తులు పాల్గొన్నారు.



మహా రుద్రాభిషేకం నిర్వహిస్తున్న భక్తులు
(ఇన్‌సెట్‌లో ఏకచక్రేశ్వరాలయంలో కొలువుధీరిన మహా శివలింగం)

ఘనంగా చిలుకల చిన్నమ్మ జాతర

ముప్కాల్, ఫిబ్రవరి9: బాల్కొండ మండల కేంద్రంలోని శ్రీరాంపూర్ గ్రామంలో చిలుకల చిన్నమ్మ జాతర ఉత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, నూతన వస్త్రాలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. జాతర సందర్భంగా ఆలయ ఆవరణలో పలు దుకాణాలు వెలిశాయి. గ్రామాభివృద్ధి కమిటీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందుస్తు ఏర్పాట్లు చేశారు.

డొంకేశ్వర్: మండలంలోని తొండాకూర్, నికాల్‌పూర్, డొంకేశ్వర్ గ్రామాలలో చిలుకలచిన్నమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు గంగనీళ్లకు వెళ్లి గ్రామ వీధుల గుండా డప్పువాయిద్యాలు, వల గొడుగులతో ఊరేగింపు నిర్వహిస్తూ అమ్మవారికి జలాభిషేకం చేశారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో పాడి పంటలు పండాలని, పిల్ల పాపలను చల్లంగా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు. ఇందులో వీడీసీ కమిటీ సభ్యులు, మహిళలు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.



శ్రీరాంపూర్ చిలుకల చిన్నమ్మ ఆలయంలో బారులు తీరిన భక్తులు



డొంకేశ్వర్‌లో గంగనీళ్లను తీసుకెళ్తున్న వీడీసీ సభ్యులు

ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం

● ఆర్మూర్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్

ఆర్మూర్ రూరల్, ఫిబ్రవరి 9: ఆర్టీసీ బస్సులో ప్రయాణించడమే ప్రజలకు సురక్షితమని ఆర్మూర్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ బస్‌డిపోలో జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే వారు జాగ్రత్తగా ఉండాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దన్నారు. రోడ్డు భద్రతపై ఆర్టీసీ డ్రైవర్‌లకు అవగాహన కల్పించారు. అనంతరం ఉత్తమ ఆర్టీసీ డ్రైవర్‌లను శ్రీనివాస్, నారాయణ, ముత్తెన్నలను వారు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై గంగాధర్, డిపో మేనేజర్ ఆంజనేయులు, ఆర్టీసీ సిబ్బంది ఎన్‌వీవీ.రెడ్డి, షైమద్, తదితరులు పాల్గొన్నారు.



త్రీహిల్స్ అన్నపూర్ణేశ్వరీదేవి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

అంగరంగ వైభవంగా రథోత్సవం

సిరికొండ ఫిబ్రవరి 9: రెండు రోజుల పాటు సాగిన త్రీహిల్స్ అన్నపూర్ణేశ్వరీ జాతర సందర్భంగా శుక్రవారం సాయంత్రం భక్తుల కేరింతలు, ఆనందోత్సవాల మద్య రథోత్సవం అంగరంగా వైభవంగా జరిగింది. వేద పండితుల మంతోచ్ఛరణల మధ్య త్రీహిల్స్ కొండ కింద నుంచి ప్రధాన రోడ్డు వరకు భక్తులు రథాన్ని తాళ్లతో లాగారు. భక్తులు తమ ఇష్టదైవమైన అన్నాపూర్ణేశ్వరీ దేవిన దర్శించుకున్నారు. భక్తుల కోసం ఆలయ కమిటి, భజన మండలి సభ్యులు అన్నసత్రాన్ని ఏర్పాటు చేశారు.

● **లొంక రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న భక్తులు**

మాఘ శుద్ధ బహుళ అమావాస్య సందర్భంగా లొంకలో రామలింగేశ్వర స్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యాలో వచ్చి దర్శించుకున్నరు. ప్రత్యేక పూజలు, అన్నపూజలు చేశారు. కోనేటిలో స్నానాలు ఆచరించి రామలింగేవ్వరున్ని దర్శించుకున్నారు. రాత్రికి సిరికొండ అంబరీషుడిపై రామలింగేశ్వరుడు భక్తులకు దర్శన మిచ్చాడు. పురవీధుల్లో ప్రభాత్ భేరీ నిర్వహించారు.

అభంగపట్నంలో 'గావ్ చలో ఘర్ చలో'

నవీపేట, ఫిబ్రవరి 9: మండలంలోని అభంగపట్నంలో శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో గావ్ చలో ఘర్ చలో కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో చేపడుతున్న వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు.



అవిశ్వాస తీర్మానానికి చేతులెత్తిన డైరెక్టర్లు

పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్‌లపై నెగ్గిన అవిశ్వాసం

సిరికొండ, ఫిబ్రవరి 9: పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్‌పై శుక్రవారం నిర్వహించిన అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా మెజార్టీ డైరక్టర్లు చేతులెత్తడంతో తీర్మానం నెగ్గినట్లయింది. చైర్మన్ మైలారం గంగారెడ్డి, వైస్ చైర్మన్ ఏ.ప్రకాష్‌లపై జనవరి 12న తొమ్మిది మంది డైరక్టర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తూ అవిశ్వాస నోటీసును జిల్లా సహకార అధికారికి అందజేశారు. శుక్రవారం సహకార సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా సహకార అధికారి శ్రీనివాస్ అధ్యక్షత వహించగా.. అసిస్టెంట్ రిజిస్ట్రార్లు రవీందర్, పోచయ్యలు హాజరయ్యారు. ఈ సమావేశానికి 11 మంది డైరక్టర్లు హాజరుకాగా అవిశ్వాస తీర్మాణంపై జరిగిన ఓటింగ్‌లో మెజార్టీ డైరక్టర్లు అనుకూలంగా చెతులెత్తారు. ఒక్క డైరక్టర్ మాత్రం తటస్థంగా ఉన్నాడు. అప్పుడే హైకోర్టు నుంచి నోటీసులు అందడంతో డీసీవో ఫలితాలను ప్రకటించకుండా నిలపివేశారు. డీసీవో మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు ఈనెల 15వ తేదీ వరకు ఫలితాలు ప్రకటించడం లేదని కోర్టు ఆదేశాలను బట్టి తదుపరి నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. అలాగే ఎలాంటి ప్రొసిడింగ్‌ను జారీ చేయకుండానే వెళ్లిపోయారు.

సొసైటీ చైర్మన్ బాధ్యతల స్వీకరణ

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 9: డిచ్‌పల్లి ఖిల్లా సొసైటీ వైస్ చైర్మన్‌గా కుమ్మరి చిన్న గంగారాం శుక్రవారం ఇన్‌చార్జీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇదీ వరకు ఉన్న చైర్మన్ జైపాల్ తన పదవీకి రాజీనామా చేయడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇన్‌చార్జీ చైర్మన్‌గా గంగారాం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం డైరెక్టర్‌లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గంగారాంను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు చిన్ననర్సింలు, సాయిలు, రమేష్, రాంచందర్; లత, రాజమ్మ, హరిచంద్, గంగారెడ్డి, సతీష్‌రెడ్డి, శ్యామ్‌సాన్, కిషన్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'మొదటి సెమిస్టర్ వాయిదా వేయాలి'

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 9: ఈనెల 17న జరిగే మొదటి సెమిస్టర్‌ను సిలబస్ పూర్తికాని సందర్భంగా వాయిదా వేయాలని ఏబీవీపీ వర్సిటీ నాయకులు అమృత్‌చారి, నాగరాజు, హరికృష్ణ, సాయి, అనిల్, చందులు రిజిస్ట్రార్ యాదగిరికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఇందుకు సంబంధించి త్వరలోనే నిర్ణయాన్ని వెల్లడిస్తామని టీయూ రిజిస్ట్రార్ హామీ ఇచ్చారని విద్యార్థి నాయకులు ఈ సందర్భంగా తెలిపారు.

12న మండల సర్వసభ్య సమావేశం

నవీపేట,ఫిబ్రవరి 9: ఈనెల 12న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11గంటలకు ఎంపీపీ సంగెం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగే మండల సర్వసభ్య సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

'హాల్ టెకెట్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలి'

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 9: 2020-24, 2025 విద్యా సంవత్సరానికి గాను గురుకుల పాఠశాలలో చదివే 5వ తరగతి విద్యార్థుల ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులు ఇంటర్నెట్ ద్వారా హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోలని జిల్లా కోఆర్డినేటర్ సంగీత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11న ఉదయం 10గంటలకు పరీక్ష కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష జరుగుతుందని, అభ్యర్థులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఆశా వర్కర్ల పెండింగ్ వేతనాలను చెల్లించాలి : సీఐటీయూ

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 9: ఆశా వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట దర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ జిల్లాలో పని చేస్తున్న ఆశా వర్కర్లకు డిసెంబర్, జనవరి నెలలకు సంబంధించిన పారితోషకాలు అందలేదని, గతంలో ప్రతీనెల 2న అకౌంట్‌లో పడేవని, కానీ రెండు నెలలు దాటినా అందకపోవడంతో ఆశా వర్కర్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆశా వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలని, అదేవిధంగా పండుగల సమయంలో పస్తులు ఉండాల్సిన పరిస్థితులు ఉన్నాయని, వెంటనే వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుకన్య, బాలమణి, రమ, స్వప్న, రేణుక, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు